# దివ్యవనాలు - విశిష్టత 11




జె. వేణిమాధవి
నేచురలిస్ట్


*(గత సంచిక తరువాయి)*

**యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా**
**యా వీణా వరదండ మండిత కరా యా శ్వేతపద్మాసనా।**
**యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవై సదా పూజితా**
**సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా॥**



తెల్ల తామర పువ్వు



కలువ పువ్వు

(సాధారణంగా తెల్ల తామర పువ్వుని తెల్ల కలువ పువ్వుతో పొరబడతారు. ఈ రెంటికీ ఎంతో వ్యత్యాసం ఉంది. వాటి రేకలు, పుప్పొడి, సువాసనలలో కొన్ని వ్యత్యాసాలు ఉంటాయి. ఆంగ్లములో తామర అంటే 'లోటస్', కలువ అంటే 'వాటర్ లిల్లీ'.)

దసరా నవరాత్రులు సెప్టెంబరు 28 నుండి ప్రారంభం. మూలా నక్షత్రం రోజున సరస్వతి పూజని విశేషంగా చేస్తారు. కొలనులో సహజ ముగా వికసించిన తెల్ల తామర పువ్వులను సేకరించి, భక్తి పూర్వకముగా సమర్పించినప్పుడు ఆ 'చదువుల తల్లి' సరస్వతి పరిపూర్ణముగా అను గ్రహిస్తుంది.

(పూర్వము దేవాలయ భూములలో ఆయా దేవతలకి వ్రతాదులు, నిత్యపూజలలో సమర్పించే పత్ర, పుష్ప, ఫల వృక్షాలను పెంచేవారు. ఏ రోజు కావలసిన పత్ర పుష్పాదులను భక్తిభావంతో నిష్ఠగా, తాజాగా ఆరోజే వికసించిన పువ్వులు, పక్వానికి వచ్చిన పండ్లను మాత్రమే సేకరించి సమర్పించేవారు. అప్పుడు వాటి సహజసిద్ధమైన రంగు, రుచి సువాసన లను పంచేంద్రియాలతో ఆస్వాదించి, ధ్యాననిమగ్నమై ఆయా దేవతల అనుగ్రహ ప్రాప్తులై, అభీష్టాలను నెరవేర్చుకొనేవారు. మరి ఇప్పటి రోజుల్లో దేవాలయ భూముల పరిస్థితులను మనము చూస్తూనేవున్నాము. వాటిని సరైన పద్ధతిలో సద్వినియోగ పరచుకోవటం మనందరి బాధ్యత.

1) పూర్తిగా వికసించని పూలను (మొగ్గలను) కోయటం.
2) మొక్క మీద ఒక్క పువ్వుని కూడా ఉంచకుండా అన్నింటిని కోసేయటం.
3) పువ్వులు కోయటానికి కొమ్మలను విరచటం, చెట్టుని గాయ పరచటం.

ఇటువంటి చర్యల వల్ల, ఎల్లప్పుడు దీవించే మొక్కలు, పుష్పాలు మనల్ని శపిస్తాయని మన పూర్వీకులు చెప్పేవారు. ఆకులు, పువ్వులు, పండ్లను కోసేముందు ఆయా మొక్కల నుంచి అనుమతి తీసుకుని, సున్నితంగా, ప్రేమతో వాటిని నొప్పించకుండా సేకరించినప్పుడు మాత్రమే ఆ వన దేవతల అనుగ్రహము ఆశీస్సులు (పూజ లేక వ్రతఫలము, ఔషధ గుణాలు) మనకి పరిపూర్ణంగా లభిస్తాయి.)

## మీ వృక్షం ఏది?

### 21. ఉత్తరాషాఢ నక్షత్రం - పనస చెట్టు

సంస్కృత నామం : **'పనస'**
శాస్త్రీయ నామం : ఆర్టోకార్పస్





దయాగుణం ఉంటే మనస్సు కరుగుతుంది.

ప్రాంతీయ నామం : పనస
ఆంగ్ల నామం : జాక్

**ఔషధ గుణాలు :**

1) విరోచనాలను తగ్గిస్తుంది.
2) చర్మవ్యాధులను నివారిస్తుంది.
3) గొంతు రుగ్మతలను తగ్గిస్తుంది.
4) పండ్లలోని జిగురు పదార్థం, జీర్ణాశయంలోని పుండ్లకి (అల్సర్లు) ఉపశమనం కలిగిస్తుంది.
5) మత్తుని, s;గుణం కూడా దీనికి ఉంది.

**విశేష గుణాలు :**

1) పనస ఆకులలో కొందరు ఆహారం తీసుకుంటారు. వీటిలోని రసాయనాలు మన శరీరములోని విష ప్రభావాన్ని తగ్గిస్తుంది.

*సూచన : 1) పనసపండ్లు నిదానంగా అరుగుతాయి. అరుగుదల ఇబ్బందులు ఉన్నవాళ్ళు జాగ్రత్తపడాలి. 2) వీటికి వాతము, కఫాన్ని కలిగించే గుణం ఉంటుంది.*

## 22. శ్రవణా నక్షత్రం - జిల్లేడు చెట్టు

సంస్కృత నామం : **'శ్వేతార్క'**
శాస్త్రీయ నామం : కేలోట్రోపిస్
ప్రాంతీయ నామం : తెల్ల జిల్లేడు
ఆంగ్ల నామం : మిల్క్ వీడ్



**ఔషధ గుణాలు :**

1) బోదకాలుని నయం చేస్తుంది.
2) పక్షవాతాన్ని తగ్గిస్తుంది.
3) క్షయ (లెప్రసీ) ని సమర్థవంతంగా నిర్మూలిస్తుంది.
4) చర్మవ్యాధులు, చెవినొప్పి, ఆస్మాలను నయం చేస్తుంది.
5) మొలలు, కొన్నిరకాల కంటి జబ్బులను తగ్గిస్తుంది.

**విశేష గుణాలు :**

**అర్కగణపతి :** ఈ తెల్ల జిల్లేడు మొక్కని నిత్యము భక్తితో పూజిస్తూ ఉంటే, కొన్ని సంవత్సరాలకి దాని వేరు గణేశ ఆకృతిని పొందుతుంది. ఆయన రూపం పూర్తిగా వచ్చాక ఆ చెట్టు ఎండిపోయి తనని తాను ప్రకటించుకుంటుంది. అదే 'శ్రీ అర్క గణపతి' విగ్రహము. వేద పురాణాలలో అనేక సందర్భాలలో చెప్పినట్లు, దేవతలు వివిధ దివ్య వృక్షాల రూపంలో ఈ భూమిమీద వెలసి మనల్ని అనుగ్రహిస్తారన టానికి ఈ జిల్లేడు మొక్క ఒక నిలువెత్తు తార్కాణం. ఈ విషయాన్ని 'శ్రీ మహాగణపతి' యే స్వయంగా దివి నుండి భువికి దిగివచ్చి మనకి చూపిస్తున్నాడు.

(భారతీయ సంప్రదాయంలో అనాదిగా వస్తున్న చెట్లని ఆరాధించుట, పూజించుట అన్నవి మూర్ఖత్వము, మూఢవిశ్వాసము కాదు. మనకి ప్రకృతి పట్ల ఉన్న ఆరాధన, కృతజ్ఞతా భావాల్ని వ్యక్తపరచటం ఈ చర్యలోని అంతరార్థం. ప్రకృతిని సంరక్షించడం మన బాధ్యత. దానిని నిర్లక్ష్యం చేసిననాడు, మానవుల మనుగడ మరియు ఉనికే ఉండదు. మానవుల జాతి మొత్తం అంతరించిపోతుంది. మన మునులు, ఋషులు ఒక సంప్రదాయాన్ని మనకందించారంటే, అది లోకకళ్యాణార్థం ఉద్దేశించినదై ఎంతో దూరదృష్టి కలిగి ఉంటుంది.)

**సూర్య భగవానుడు :** తెల్ల జిల్లేడు మొక్క సూర్యుడికి సంకేతంగా చెప్పబడింది. రథసప్తమి రోజున తెల్ల జిల్లేడు ఆకులను తలమీద, భుజాల మీద పెట్టుకొని స్నానం చేస్తారు. అలా మూడుసార్లు చేస్తారు. సంస్కృతంలో జిల్లేడుకు ఉన్న పేర్లను చూస్తే అనేక నామాలు సూర్యుడికి సంబంధించినవి ఉన్నాయి. అర్క, అలర్క, ఆదిత్య, భాను, భాస్కర, దివాకర్, రవి, సప్తాశ్వ, సూర్యపత్ర, సూర్యవ్హ మొగలగునవి. తెల్ల జిల్లేడు మొక్క సాక్షాత్తు ప్రత్యక్షదైవమైన 'శ్రీ సూర్యభగవానుడే.' (నవగ్రహ వనంలో ప్రతి గ్రహానికి ఒక మొక్క సూచించబడింది.)

**శ్రీ వేంకటేశ్వరుడు :** శ్రీ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం. తెల్ల జిల్లేడు మొక్క ఆయన గుణాలను ప్రతిబింబిస్తుంది.

**ఈశ్వరుడు :** తెల్ల జిల్లేడు పూలను కొన్ని శివవ్రతాదులందు సమర్పిస్తారు.

**పర్యావరణం :** జిల్లేడు మొక్క అటు వేద విజ్ఞానపరంగా ఎంతో దివ్యత్వాన్ని కలిగి ఉండటమే కాకుండా ఇటు జంతు శాస్త్రపరంగా చూసినట్లయితే పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది.

ఒక రకం సీతాకోకచిలుకలు జిల్లేడు కుటుంబానికి చెందిన మొక్కల మీద మాత్రమే తమ గ్రుడ్లను పెడతాయి. వాటి జీవితచక్రం మొత్తం ఈ మొక్క మీద ఆధారపడి ఉంటుంది.



చేసినపని మంచిదైనా చెడ్డదైనా తప్పకుండా అనుభవించాల్సిందే.



గుడ్డు



లార్వా



ప్యూప



సీతాకోకచిలుక

## సీతాకోకచిలుక జీవిత చక్రం :



భ్రమర కీటకాలు వీటినుంచి మకరందాన్ని తీసుకుంటాయి. వీటి కాళ్ళకి జిల్లేడు యొక్క పుప్పొడి (పోలెన్ సేక్స్) అంటుకొని పరపరాగ సంపర్కానికి (క్రోస్ పోలినేషన్) తోడ్పడతాయి.



వివిధ దశలలోని సీతాకోక చిలుకలను, కీటకాలను పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. ఈవిధంగా ఈ మొక్క 'ఆహారపు గొలుసు' ఇంకా ఆహార పిరమిడ్లలో (ఫుడ్ చైన్, ఫుడ్ పిరమిడ్స్) ఒక కీలకపాత్ర పోషిస్తుంది.



ఈ మొక్కను అవకాశం ఉన్న ప్రతి ఇంటా మరియు పైన తెలిపిన ప్రతి దేవాలయాలలో తప్పనిసరిగా పెంచాలి. ఇంతటి విశేషమున్న ఈ దివ్యవృక్షం గురించిన జ్ఞానమంతా కాలక్రమేణా మరుగున పడిపోయి, అది కేవలము విషంపాలు కారే ఒక పిచ్చి మొక్కగా పరిగణించి, ఆదరణకు నోచుకోక, పీకి పారేయడం జరుగుతోంది. ఇకనుంచైనా ఈ దివ్యవృక్షాన్ని ఆదరించి ఆరాధిద్దాం.

అయితే మనం ఇక్కడ ఒక సూక్ష్మాన్ని గ్రహిద్దాము : 'ప్రతి విషము అతి తక్కువ మోతాదులో సేవిస్తే, అది ఔషధ మౌతుంది. ప్రతి ఔషధము అధిక మోతాదులో సేవిస్తే, అది విషమౌతుంది.'

మన ఇంట్లో తప్పనిసరైనవి, కానీ అజాగ్రత్తగా ఉంటే హాని కలిగించే పొయ్యి, కత్తిపీట వంటి వస్తువులతో ఏవిధంగా జాగ్రత్తపడుతూ వాడుకుంటామో, ఈ మొక్కని కూడా సంరక్షించి పెంచటం మన భాగ్యం. మనం మొక్కలు నాటలేకపోయినా కనీసం ఉన్న వాటిని పీకకుండా, ఇటువంటి విషయాలని నలుగురితో పంచుకుంటుంటే, అది వెయ్యిమొక్కలు నాటినంత ఫలాన్నిస్తుంది.

మన ఇంటి ముంగిట్లో ఈ దివ్యవృక్షం ఉండి పూజలందుకొంటే సాక్షాత్తూ శ్రీ మహాగణపతి, శ్రీ సూర్యభగవానుడు, శ్రీ వేంకటేశ్వరస్వామి మరియు ఈశ్వరుడు మన ఇంట వెలసి మనలను అనుగ్రహిస్తారు. కొన్ని రాష్ట్రాల ప్రజలు ఈ మొక్కని ఇంటి ప్రధానద్వారం ప్రక్కన పెంచుకొని ఆరాధిస్తుండటాన్ని మనం చూడవచ్చు.

**ఇంటింటా జిల్లేడంటా!**
**విఘ్నాలకు సెలవంటా!**

*సూచన : ఔషధ గుణాలు సూచనమాత్రంగా ప్రస్తావించడం జరిగింది. వైద్యుని సంప్రదించిన పిదపనే వాటిని ఉపయోగించమనవి.*

(సశేషం)



కార్యసానుకూల్యం కోరేవాడు ఎంతమందిచే పరాభవింపబడ్డా ఓర్పు వహించాలి.